# 87. అల్ ఆలా (మహోన్నతుడు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 19 ఆయతులు ఉన్నాయి. ఇది ముఖ్యంగా ఏకదైవారాధన గురించి బోధించింది. మొదటి ఆయతులో వచ్చిన 'ఆలా' (మహోన్నతుడు) అన్న పదాన్నే దీనికి పేరుగా పెట్టడం జరిగింది. దేవుని ఏకత్వం, ఆయనకున్న విశిష్టమైన సృష్టిసామర్థ్యాలను ఈ సూరా ప్రధానంగా వివరించింది. ప్రజలు హితబోధను అనుసరించాలని, అల్లాహ్ శక్తిసామర్థ్యాలను, ఆయన కారుణ్యాన్ని, ఆయన అనుగ్రహాలను, ఆయన ఆగ్రహాన్ని, శిక్షాబహుమానాలను ఇతరులకు గుర్తుచేయాలని ఈ సూరా బోధించింది. మానవులు ఇహలోక జీవితం పట్ల వ్యామోహం పెంచుకున్నారని, కాని నిజానికి మనిషికి పరలోక జీవితమే లక్ష్యం కావాలని, పరలోక జీవితం ఇంతకన్నా ఉన్నతమైనదని, శాశ్వత మైనదని ఈ సూరా ప్రబోధించింది.

## 87. అల్ ఆలా[1] సూరా

سُورَةُ الأَعْلَىٰ

అవతరణ :మక్కా ఆయతులు : 19

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**1** (ఓ ప్రవక్తా!) సర్వోన్నతుడైన నీ ప్రభువు నామం యొక్క పవిత్రతను కొనియాడు.[2]

سَبِّحِ اسْمَ رَبِّكَ الْأَعْلَى ①

**2** ఆయనే సృష్టించాడు, మరి ఆపైన తీర్చిదిద్దాడు.[3]

الَّذِي خَلَقَ فَسَوَّىٰ ②

**3** ఆయనే (కావలసిన వాటిని తగురీతిలో) నిర్ధారించాడు. పిదప మార్గం చూపించాడు.[4]

وَالَّذِي قَدَّرَ فَهَدَىٰ ③

1. దైవప్రవక్త (సఅసం) సాధారణంగా జుమా నమాజులోనూ, పండుగల నమాజుల్లోనూ ఈ సూరాను, అల్ గాషియా సూరాను పారాయణం చేసేవారు. అలాగే విత్ర్ నమాజులోని మొదటి రకాత్‌లో కూడా అల్ ఆలా సూరాను పఠించేవారు. రెండవ రకాతులో కాఫిరూన్ సూరా, మూడవ రకాతులో ఇఖ్లాస్ సూరాను సాధారణంగా పఠించేవారు. హజ్రత్ ముఆజ్ (రజి) నమాజులో సుదీర్ఘమైన సూరాలు చదువు తున్నారని ఫిర్యాదు వచ్చినప్పుడు దైవప్రవక్త (స) ఆయనగారికి ఫలానా ఫలానా సూరాలు చదివితే సరిపోతుందని సూచించారు. ఆ సూరాల జాబితాలో ఈ సూరా కూడా ఉంది (సహీహ్ హదీసులలో ఈ వివరాలున్నాయి).

2. అంటే అల్లాహ్ ఔన్నత్యానికి శోభించే విధంగా ఆయన్ని స్తుతించాలి. ఈ సూరాలోని ఈ వాక్యం వచ్చినప్పుడల్లా దైవప్రవక్త (సఅసం) **"సుబ్‌హాన రబ్బియల్ ఆలా"** అనేవారని హదీసు ద్వారా తెలుస్తోంది. (ముస్నదె అహ్మద్ – 1/232; అబూ దావూద్ – కితాబుస్సలాత్; అల్‌బానీ ఈ హదీసును ప్రామాణికమైన హదీసుగా పేర్కొన్నారు.)

3. దీని వివరాల కోసం ఇన్‌ఫితార్ సూరా 7వ ఆయతుకు ఇవ్వబడిన పాదసూచికలను చూడండి.

4. అంటే, మంచీ – చెడులనే రెండు మార్గాలను మనుషుల ముందుంచాడు. అలాగే జీవనావసరాలను సమకూర్చాడు. ఈ మార్గదర్శకత్వం పశువులకు కూడా చేయబడింది. ఆహార వస్తువులను ప్రసాదించటంతోపాటు, ఆ వస్తువుల గుణాలను, వాటి

**4** మరి ఆయనే పచ్చిక బయళ్లను ఉత్పన్నం చేశాడు.[5]

وَالَّذِيْٓ اَخْرَجَ الْمَرْعٰى ۝۴

**5** ఆపైన వాటిని నల్లని చెత్త కుప్పగా చేసేశాడు.[6]

فَجَعَلَهٗ غُثَاۗءً اَحْوٰى ۝۵

**6** మేము నిన్ను చదివిస్తాము – మరి నువ్వు దానిని మరువలేవు.[7]

سَنُقْرِئُكَ فَلَا تَنْسٰٓى ۝۶

**7** అయితే అల్లాహ్ తలచినది మాత్రం (మరువగలవు). ఆయన బహిర్గతమయ్యే దానినీ, గోప్యంగా ఉన్నదానినీ ఎరిగిన వాడు.[8]

اِلَّا مَا شَاۗءَ اللّٰهُ ۭ اِنَّهٗ يَعْلَمُ الْجَهْرَ وَمَا يَخْفٰى ۝۷

లాభనష్టాలను కూడా మనిషికి ఎరుకపరిచాడు. మనిషి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నదే దీని అసలు ఉద్దేశం.

5. వాటిని పశువులు మేస్తాయి.

6. ఎండిపోయిన గడ్డిని **'ఘుసాఅన్'** ( غُثَاۗءً ) గా వ్యవహరిస్తారు. **'అహ్వా'** ( اَحْوٰى ) అంటే నల్లగా మార్చేయటం. ఒకప్పుడు పచ్చగా నవనవలాడుతూ ఉండే గడ్డిని మేము తరువాత చెత్తాచెదారంగానూ, కసువుగానూ మార్చేస్తాము అని భావం.

7. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవవాణిని తీసుకుని వచ్చినప్పుడు మహాప్రవక్త (సఅసం) దాన్ని కంఠస్తం చేసుకునేందుకు తొందరపడేవారు. దైవవాణి (ఖుర్ఆన్)ని మరచిపోతానేమోనన్న భయం ఆయనకు ఉండేది. దానికోసం కంగారు పడాల్సిన అవసరం లేదని, తాను అవతరింపజేసిన వాణి (వహీ)ని చదివింపజేసి, దాన్ని జ్ఞాపకం ఉంచేలా చేసే బాధ్యత తనదని దేవుడు ఈ వాక్యంలో తన ప్రవక్తకు అభయం ఇచ్చాడు. ఒకవేళ అల్లాహ్ ఏ విషయాన్నయినా మరపింపజేయదలచుకుంటే అది వేరే విషయం. కాని అలా జరగలేదు కూడా. తనపై అవతరింపజేయబడిన ఖుర్ఆన్ గ్రంథం దైవప్రవక్త (సఅసం)కు ఆసాంతం కంఠస్థం అయింది. అయితే ఖుర్ఆన్ గ్రంథంలో – దేవుడు రద్దు పరచదలచిన ఆయతులను మరపింపజేస్తాడని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

8. అంటే – ఖుర్ఆన్ భాగాలలో నీవు బిగ్గరగా పలికేదీ, లోలోపల పలికేదీ, అందరికీ తెలిసేవిధంగా ఆచరించేదీ, గోప్యంగా ఆచరించేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసు. ఆయన నుండి ఏ విషయం కూడా దాగిలేదు.

**8** (ఓ ముహమ్మద్ – స!) మేము నీకు సౌలభ్యాన్ని సమకూరుస్తాము.[9]

وَنُيَسِّرُكَ لِلْيُسْرَىٰ ﴿٨﴾

**9** కనుక నీవు ఉపదేశం లాభదాయకం అయితే, ఉపదేశిస్తూ ఉండు.[10]

فَذَكِّرْ إِن نَّفَعَتِ الذِّكْرَىٰ ﴿٩﴾

**10** (అల్లాహ్ పట్ల) భయమున్నవాడు ఉపదేశాన్ని గ్రహిస్తాడు.[11]

سَيَذَّكَّرُ مَن يَخْشَىٰ ﴿١٠﴾

**11** దౌర్భాగ్యుడు మాత్రమే దాన్ని దాట వేస్తాడు.[12]

وَيَتَجَنَّبُهَا الْأَشْقَى ﴿١١﴾

**12** వాడు పెద్ద (ఘోరమైన) అగ్నిలోకి ప్రవేశిస్తాడు.

الَّذِي يَصْلَى النَّارَ الْكُبْرَىٰ ﴿١٢﴾

**13** వాడందులో చావనయినా చావడు, బ్రతకనయినా బ్రతకడు.[13] (రెంటికీ మధ్య దుర్భరస్థితిలో ఉంటాడు).

ثُمَّ لَا يَمُوتُ فِيهَا وَلَا يَحْيَىٰ ﴿١٣﴾

9. అంటే – దివ్య ఖుర్‌ఆన్ కంఠపాఠాన్ని, దాని ప్రకారం ఆచరించటాన్ని నీకు సులభతరం చేస్తాము. ఖుర్‌ఆన్ చూపే మార్గంలో పురోగమించటాన్ని కూడా మేము క్రమేణా సులభతరం చేస్తాము. స్వర్గానికి పోయే మార్గాన్ని మేము నీకు సులువు చేస్తాము. శుభాలతో నిండిన ఉపదేశాలను, కర్మలను మేము నీ కొరకు తేలిక చేస్తాము. మేము నీ కొరకు ఆమోదించే ధర్మశాస్త్రాన్ని (షరీయతు) కూడా ఎంతో సరళమైనదిగా, స్థిరమైనదిగా, అనువైనదిగా, సమతూకంతో కూడుకున్నదిగా చేస్తాము. అందులో ఎలాంటి వక్రతగానీ, ఆటంకంగానీ, అపసవ్యతగానీ, ఇబ్బందిగానీ ఉండదు.

10. ఎవరికయినా హితబోధ ప్రయోజనకరం అవుతుందనుకుంటేనే హితబోధ చేయి. హితబోధకు, శిక్షణకు సంబంధించిన ఒక సూత్రం ఈ ఆయతు ద్వారా విశదీకరించ బడింది (ఇబ్నె కసీర్). ఇమామ్ షౌకానీ దీనిని ఈ భావంలో తీసుకున్నారు: ప్రవక్తా! మీరు హితబోధ చేస్తూ ఉండండి. అది ప్రయోజనదాయకం అయినా కాకపోయినా సరే; మీరు మాత్రం తప్పనిసరిగా సందేశాన్ని అందజేస్తూ ఉండాల్సిందే.

11. మనసులో దైవభీతిగలవారు, తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్న తపనగలవారు నీ ఉపదేశం ద్వారా తప్పకుండా లబ్ది పొందుతారు. అలాంటివారి విశ్వాసం నీ బోధ మూలంగా మరింత దృఢతరం అవుతుంది.

12. నీ ఉపదేశాలు వారి బుర్రకెక్కవు. ఎందుకంటే దైవధిక్కారవైఖరిపై పాతుకుపోయిన

**14** పవిత్రుడైనవాడు ఖచ్చితంగా సాఫల్యం పొందాడు.[14]

قَدْ أَفْلَحَ مَنْ تَزَكّٰى ﴿١٤﴾

**15** అతను తన ప్రభువు నామాన్ని స్మరించాడు. నమాజు ఆచరించాడు.

وَذَكَرَ اسْمَ رَبِّهٖ فَصَلّٰى ﴿١٥﴾

**16** కాని మీరు మాత్రం ప్రాపంచిక జీవితానికే ప్రాముఖ్యమిస్తున్నారు.

بَلْ تُؤْثِرُوْنَ الْحَيٰوةَ الدُّنْيَا ﴿١٦﴾

**17** వాస్తవానికి పరలోకం ఎంతో మేలైనది, ఎప్పటికీ మిగిలివుండేది.[15]

وَالْاٰخِرَةُ خَيْرٌ وَّاَبْقٰى ﴿١٧﴾

**18** ఈ విషయాలు మునుపటి గ్రంథాలలోనూ ఉన్నాయి.

اِنَّ هٰذَا لَفِي الصُّحُفِ الْاُوْلٰى ﴿١٨﴾

**19** (అంటే) ఇబ్రాహీము, మూసాల గ్రంథాలలో!

صُحُفِ اِبْرٰهِيْمَ وَمُوْسٰى ﴿١٩﴾

కారణంగా, నిరంతరం పాపాలు చేస్తూ ఉండటం వల్ల వారి హృదయాలకు తుప్పు పట్టింది. వారి మేధ ముకుళించుకుపోయింది.

13. నరకానికి ఆహుతి అయ్యే వారిలో కొందరయితే శాశ్వతంగా నరకయాతనను అనుభవిస్తారు. మరికొందరి వ్యవహారం తద్భిన్నంగా ఉంటుంది. వారు నరకంలో కొంతకాలం మాత్రమే ఉంచబడతారు. దేవుడు వారికి ఒకలాంటి చావును కూడా ఇస్తాడు. వారు అగ్నిలో మాడి బొగ్గులా తయారవుతారు. ఆ తరువాత దేవుడు తన ప్రవక్తల సిఫారసుపై వారిని వర్గాలుగా, సమూహాలుగా బయటికి తీస్తాడు. వారంతా స్వర్గకాలువలో ముంచబడతారు. స్వర్గవాసులు కూడా వారిపై నీళ్ళు కుమ్మరిస్తారు. ఆ విధంగా వారు సజీవులవుతారు – వరద వెల్లువలో కొట్టుకువచ్చిన చెత్తకుప్పపై మొలకెత్తిన విత్తనం మాదిరిగా! (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

14. తమ ఆంతర్యాన్ని నైతికపు రుగ్మతల నుండి, పాపిష్టికరమైన ఆలోచనల నుండి, బహుదైవోపాసనా కాలుష్యం నుండి రక్షించుకుని ఏకాగ్రతతో నిజప్రభువు మార్గాన్ని అవలంబించినవారు, దైవదాస్యమే జీవిత పరమావధిగా భావించినవారు నిశ్చయంగా కృతార్థులవుతారు. వారి జీవితం ధన్యమవుతుంది.

15. ఎందుకంటే ప్రాపంచిక జీవితం క్షణభంగురం. పరలోకం శాశ్వతం. విజ్ఞుడైనవాడు తాత్కాలిక వస్తువు బదులు శాశ్వత వస్తువునే కోరుకుంటాడు.